క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: వరల్డ్ స్కిల్ కాంపిటీషన్–2024 పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 50 విభాగాల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలు ఉంటాయని అన్నారు. ఆటోబాడీ రిపేర్, ఆటోమోబైల్స్, బ్యూటీథెరపీ, సీఎన్‌సీ మిల్లింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో పోటీలు ఉంటాయని, అర్హులైన వారు ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధికార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జేసీని కలిసిన ఎంపీడీఓలు



బచ్చన్నపేట: జిల్లాకు కొత్తగా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పర్మార్ పింకేష్‌లలిత్‌కుమార్‌ను సోమవారం జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్ ఆధ్వర్యాన ఎంపీడీఓలు కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానం చేశారు. బచ్చన్నపేట, నర్మెట ఎంపీడీఓలు రఘురామకృష్ణ, ఖాజామొయినొద్దీన్ ఉన్నారు.

చంద్రశేఖర్‌కు సర్టిఫికెట్ అందజేత

రఘునాథపల్లి: సాగు మెళకువలపై రైతులకు అందజేస్తున్న సేవలకు గాను మండలంలోని ఆంధ్రతండాకు చెందిన ధరావత్.. చంద్రశేఖర్‌కు దేశ్‌పాండే ఫౌండేషన్, ఆనంద్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సర్టిఫికెట్ అందజేశారు. దేశ్‌పాండే ఫౌండేషన్, ఆనంద్ అగ్రికల్చర్ సంయుక్తంగా మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు. సాగులో నూతన విధానాలు, పాటించాల్సిన పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న చంద్రశేఖర్‌కు నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేశారు. కాగా, సర్టిఫికెట్ అందుకున్న చంద్రశేఖర్‌ను సోమవారం పలువురు రైతులు అభినందించారు.

ఉస్తాద్ ఒగ్గు రవికి డాక్టరేట్



లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ జాతీయ యువ పురస్కార అవార్డు గ్రహీత చౌదరిపల్లి రవి అలియాస్ ఒగ్గు రవికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సోమవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'ఒగ్గుకథ –నాటకీయ లక్షణాలు' అనే అంశంపై లలిత కళాపీఠం రంగస్థల కళల శాఖలో డాక్టర్ కోట్ల హనుమంతరావు పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య తంగెడ కిషన్‌రావు చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

నియామకం



సుధాకర్

రఘునాథపల్లి: మండలంలోని దాసన్నగూడెం గ్రామానికి చెందిన జేరిపోతుల సుధాకర్‌మాదిగ మహాజన సోషల్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌లు మడిపల్లి శ్యాంమాదిగ, బుంజురు విజయ్‌మాదిగ సోమవారం ప్రకటనలో తెలి పారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సుధాకర్ మాదిగ మాట్లాడుతూ జిల్లాలో మహాజన సోషలిస్ట్ పార్టీ బలోపేతానికి అవిశ్రాంతిగా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

లింగాలఘణపురం: మండలంలోని కళ్లెంలో గల డబుల్‌బెడ్రూం ఇళ్లలో గత కొంతకాలంగా నివాసముంటున్న వారికి మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. సోమవారం కళ్లెంలో జరిగిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్లలో ఉంటున్న పేదల నుంచి రూ.65వేలకు పైగా ఉన్న పెండింగ్ బిల్లులను తీసుకొని విద్యుత్ కట్ చేశారని, నల్లాలకు నీరు రాకుండా చేస్తున్నారని అన్నారు. రెండేళ్లుగా నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. దేవదానం, వెంకటేశ్, అతియా, సుజాత, యాదమ్మ పాల్గొన్నారు.

సన్మానం

దేవరుప్పుల: అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో ప్రశాంత వాతావరణానికి పాటుపడిన పోలీసులకు కృతజ్ఞతగా కాంగ్రెస్ నాయకులు ఎస్సై కొంగరి శ్రవణ్‌కుమార్‌ను సోమవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా సజ్జన్, మండల సీనియర్ నాయకులు మాసంపల్లి మహేందర్, రెడ్డి రాజుల రమేష్, ధరావత్ కీమా నాయక్, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలతో వరినాట్లు

- ఆసక్తి చూపుతున్న స్థానిక రైతులు



నాట్లు వేస్తున్న ఉత్తరాఖండ్ కూలీలు

లింగాలఘణపురం: యాసంగి వరి నాట్ల సీజన్ ముమ్మరం కావడంతో సహజంగా కూలీల కొరత ఏర్పడుతుంది. మండలంలో గత రెండేళ్లుగా వరి నాట్ల సీజన్‌లో ఉత్తరఖండ్, బీహార్ రాష్ట్రాల నుంచి వలస కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారు. స్థానిక రైతులు సైతం వలస కూలీల పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే స్థానిక కూలీలు అయితే రైతే నారు తీసి పంచాల్సి ఉంటుంది. అంతేకాకుండా వారిని వ్యవసాయ బావుల వద్దకు తీసుకెళ్లేందుకు రవాణ ఖర్చులు భరించాలి. దీనికి తోడు ఎకరం నాటు వేస్తే రూ.6,000 నుంచి రూ.6,500 డిమాండ్ చేస్తున్నారు. వలస కూలీలైతే వరినారు తీసి పంచి నాటు వేస్తే ఎకరానికి రూ.5,500 తీసుకుంటున్నారు. దీంతో రైతుకు కొంత శ్రమ తప్పడంతో పాటు రేటు కూడా తగ్గడంతో వలస కూలీలపై దృష్టి సారిస్తున్నారు. అంతేకాకుండా ఒకలైన్ వరుస క్రమ పద్ధతిలో నాట్లు వేయడంతో గాలి, వెలుతురు బాగాసోకి దిగుబడి కూడా మంచిగానే వస్తుందని అంటున్నారు.

రోజుకు 4 నుంచి 5 ఎకరాల నాట్లు

మండల కేంద్రం, జీడికల్, నెల్లుట్ల, బండ్లగూడెం తదితర గ్రామాల్లో సుమారుగా పది బ్యాచ్‌లు ఉత్తరాఖండ్ నుంచి వచ్చి వరి నాట్లు వేస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో చలి ఎక్కువగా ఉండడంతో అక్కడ నాట్లు మార్చి నెల నుంచి మొదలవుతాయని, చలి కాలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు వచ్చి నాట్లు వేస్తామని కూలీలు అంటున్నారు. రోజు ఉదయం 6గంటలకు పనులకు వెళ్లి సాయంత్రం ఆరు గంటల వరకు నాట్లు వేసి వస్తారు. 15 మంది కూలీలతో కూడిన బ్యాచ్ రోజుకు 4 నుంచి 5 ఎకరాల్లో నాట్లు వేస్తున్నారు.

ఉత్తరఖండ్‌లో మార్చి నుంచి నాట్లు వేస్తారు..



ఉత్తరాఖండ్‌లో మార్చి నుంచి నాట్లు వేస్తారు. చలి ఎక్కువగా ఉండడంతో ముందుగా వేయరు. అప్పటి వరకు ఇక్కడికి వచ్చి నాట్లు వేస్తాం. రెండేళ్లుగా తెలంగాణ ప్రాంతంలో వేస్తున్నాం. తమను ఇక్కడికి తీసుకొచ్చిన గుత్తేదారు తమకు కావాల్సినవన్నీ చూసుకుంటారు.

– మణీందర్, కూలీ, ఉత్తరఖండ్

చిరువ్యాపారులపై పోలీసుల ప్రతాపం



పోలీసుల దాడిలో రోడ్డుపై పడిన బుక్కగులాలు

జనగామ: పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై వరుస దాడులు చేస్తున్న పోలీసులు చిరు వ్యాపారులపై తమ ప్రతాపం ప్రదర్శిస్తున్నారు. రోడ్డుపై వ్యాపారాలు చేసుకుంటున్న సమయంలో ఆక్రమణలు తొలగించాలని చెప్పకుండానే సరుకులను చెల్లా చెదురు చేస్తూ నష్టపరుస్తున్నారు. రైల్వేస్టేషన్ ఏరియాలో సోమవారం తనిఖీ చేసిన పోలీసులు ఫుట్‌పాత్ వ్యాపారస్తులను గడగడలాడించారు. మౌనిక పూజా స్టోర్ వద్దకు వెళ్లి బయట ఉన్న బుక్కగులాలు, ఇతర పూజా సామగ్రిని రోడ్డు మీద పడేసి నానా దుర్భాషలాడుతూ వెళ్లిపోయారని యజమాని మురళి కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసుల దాడిలో రూ.2,500 నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని అనేక వ్యాపార సంస్థల ఎదుట చిరు వ్యాపారులకు ప్రైవేట్‌గా అద్దెకిస్తూ రోడ్డుపై అక్రమ వ్యాపారం చేస్తుంటే పట్టించుకోని పోలీసులు తమలాంటి పేద వర్గాలను ఇలా రోడ్డున ఈడ్చి నష్టపరచడం సరికాదని చిరు వ్యాపారులు ఏకరువు పెట్టారు.

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సెంట్రల్ బ్యాంకు మేనేజర్ శివశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్న రామన్‌చర్ల, ఆలింపూర్‌లో వికసిత భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతోకూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎండీ ఖలీల్‌బేగమ్, నరెడ్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ మసూద్, ఏపీఎం నాగేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి రేవతి, భానుచందర్, ఏఎన్‌ఎంలు సంపూర్ణ, రజిత, మమత ఆశాలు ప్రమీల, స్వప్న మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అమ్మా, నాన్న, గురువు పద్యార్చన



అమ్మా, నాన్న, గురువు పద్యార్చనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో తానా ఆధ్వర్యాన అమ్మా, నాన్న, గురువు పద్యార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా, 100 దేశాల్లో ఉన్న వందకు పైగా తెలుగు సంఘాల ఆధ్వర్యంలో వందే విశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ శాంతి సద్భావన శతకపద్యం నిర్వహించడం జరుగుతుందని తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులకు పెద్దలపై గౌరవం ఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు తిరునగరివకుళ, రమేష్, నరసింహమూర్తి, అశోక్, బలరాం, రవి, ఉప్పలయ్య, సంజీవ్, దీపా, భవాని ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవీందర్

జఫర్‌గఢ్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మహాత్మా హెల్పింగ్ హ్యాండ్ వ్యవస్థాపకుడు గంటా రవీందర్ అన్నారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 80 మంది 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను రవీందర్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, చంద్రమోహన్, రవి, రాజేందర్, సిరాజ్, వేణుగోపాల్, శంకర్, ఉమా, యాదగిరి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లి గ్రామసభ రసాభాస

- సభను బహిష్కరించిన కొందరు నాయకులు
- అయినా సభను కొనసాగించిన తాత్కాలిక సర్పంచ్



ఈఓతో వాగ్వాదం చేస్తున్న ప్రజలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ గ్రామసభ తాత్కాలిక సర్పంచ్ బూర్ల విష్ణు అధ్యక్షతన సోమవారం నిర్వహించగా సభ రసాభాసగా సాగింది. గ్రామ ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల వాదనలు, వాగ్వాదాల మధ్య సభ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. శివునిపల్లిలో ఉన్న ఒకే ఒక్క వార్డు సభ్యుడు(8వ) హైకోర్టు ఉత్తర్వులతో ఈనెల 13న గ్రామ తాత్కాలిక సర్పంచ్‌గా అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. అయితే సోమవారం జరిగిన గ్రామసభలో ఈఓ శ్రీకాంత్ మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై సమీక్ష చేయాలని, పారిశుద్ధ్య సమస్యలుంటే చెప్పాలని అన్నారు. దాంతో ఒక్కసారిగా సభికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గత గ్రామసభలో చేసిన తీర్మానాల్లో ఒక్క పని అయినా చేశారా, మళ్లీ తీర్మానాలు ఎందుకని, గతంలో తీర్మానం చేసిన పనులు చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్నికల కోడ్‌తో పనులు చేపట్టలేదని ఈఓ, సర్పంచ్ చెప్పే ప్రయత్నం చేస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు గుర్రం శ్రీను, యేసుబాబు, చిగురు విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మేకల మల్లేశం తదితరులు పారిశుద్ధ్య పనులకు ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందా అంటూ ఆగ్రహించారు. శివునిపల్లి సర్పంచ్ ఎస్టీ రిజర్వేషన్ కాగా బీసీ వర్గానికి చెందిన విష్ణుకు ఏ ప్రాతిపదికన సర్పంచ్‌గా ఇచ్చారన్నారు. చెక్ పవర్ రద్దు చేయాలని రభస చేశారు. దాంతో విష్ణుతో పాటు బీజేపీ నాయకులు కె.శరత్‌కుమార్, రడపాక ప్రదీప్, సీపీఐ నాయకులు తోట రమేష్ తదితరులు మాట్లాడుతూ సర్పంచ్‌గిరి హైకోర్టు నుంచి తెచ్చుకున్నారని, ఏదైనా ఉంటే కోర్టుకు వెళ్లాలని, గ్రామాభివృద్ధి జరగకుండా సభను అడ్డుకోవద్దని వాదించారు. కాగా, విష్ణుకు సర్పంచ్‌గిరి ఇవ్వడం సమంజసం కాదని, గతంలో చేసిన తీర్మానాలకు చెందిన పనులు చేయాలని బీఆర్‌ఎస్‌కు చెందిన గుర్రం శ్రీను, యేసుబాబు, చిగురు విజయ్, కాంగ్రెస్ చెందిన మేకల మల్లేశంతో పాటు పలువురు సభ నుంచి వెళ్లిపోయారు. ఎంపీటీసీ గుర్రం రాజు సైతం సభ నుంచి వెళ్లారు.

శ్వాస ఉన్నంత వరకు శివునిపల్లికి సేవ చేస్తా: బూర్ల విష్ణు

ఎలాంటి బెదిరింపులకు భయపడేది లేదని, తన ఊపిరి ఉన్నంత వరకు శివునిపల్లి ప్రజలకు సేవ చేస్తానని, గ్రామ అభివృద్ధే తన ధ్యేయమని తాత్కాలిక సర్పంచ్ బూర్ల విష్ణు అన్నారు. సభ నుంచి కొందరు ప్రజలు బయటకు వెళ్లినా మిగిలిన వారితో విష్ణు సభను నడిపించారు. శివునిపల్లిలో కొందరు అవినీతిపరులతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతుందని, అక్రమ వెంచర్లు, అవినీతితో లక్షల రూపాయలు సంపాదించారన్నారు. గత ఈఓ వెంకటకిషోర్ అవినీతిపై తానే స్వయంగా కమిషనర్‌గా ఫిర్యాదు చేశానని, విచారణలో ఉందన్నారు. గతంలో మమ్మల్ని కొందరు పెద్దమనుషులుగా చెప్పుకుంటూ హీనంగా చూశారని, కులబహిష్కరణ చేసి అవమానించారన్నారు. గ్రామానికి చెందిన ఓ నాయకుడు సివిల్ సప్లై కాంట్రాక్టర్‌గా అవినీతి చేసి అక్రమంగా రూ.కోట్లు సంపాదించారని, గ్రామంలో జరిగిన ప్రతీ అవినీతిని బయటకు తీస్తానని సవాల్ చేశారు. ఈఓ శ్రీకాంత్, ఈజీఎస్ ఏపీఓ ప్రేమయ్య, జూనియర్ అసిస్టెంట్ సుమలత, గ్రామస్తులు కూరెల్లి కృష్ణమూర్తి, యంజాల ప్రభాకర్, ఉపేందర్, హుస్మాన్, కొండ వేణు, కృష్ణమూర్తి, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సైకిళ్ల బహూకరణ



జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులకు దాత చాడ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సైకిళ్లను సోమవారం బహూకరించారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు సముద్రాల శివారు నారాయణపురం నుంచి తీగారం వరకు కాలినడక వస్తుండడంతో పాటు అక్కడి నుంచి పాఠశాలకు ఆటోలో వెళ్తున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వారికి సొంత డబ్బులతో రెండు సైకిళ్లను కొనుగోలు చేసి అందజేశారు. హెచ్‌ఎం ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు మంగు జయప్రకాశ్, కృష్ణమోహన్, శ్రీరామోజు శ్రీనివాస్‌రావు, సునీతదేవి, మంజుల, జహీరుద్దీన్, శశికళ పాల్గొన్నారు.

21న సర్వసభ్య సమావేశం

లింగాలఘణపురం: ఈ నెల 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చిట్ల జయశ్రీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఝాన్సీరెడ్డిని కలిసిన 'అమ్మ' ట్రస్టు సభ్యులు



పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిని పార్టీ కార్యాలయంలో పాలకుర్తికి చెందిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యాన చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. ట్రస్ట్‌కు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చెరిపెల్లి అశోక్, బొడ్డు కుమార్, నాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొడకండ్ల: వడ్డెకొత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో రేపు(బుధవారం) పలు సబ్‌స్టేషన్ల పరిధిలో పగటిపూట విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాములు తెలిపారు. మండల పరిధిలోని 33/11 కే.వీ కొడకండ్ల, రామవరం, మొండ్రాయి, ఏడునూతుల సబ్‌స్టేషన్లకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



రఘునాథపల్లి: తెలంగాణ మండల ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా హాజరైన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య సమక్షంలో రెండేళ్ల పాటు కొనసాగే కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పి.పరమాత్మ, అధ్యక్షుడిగా జి.వెంకటయ్య, ఉపాధ్యక్షులు ఆర్ యాదగిరి, టి యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రారెడ్డి, సహాయ కార్యదర్శిగా జి.వెంకటనారాయణ, కోశాధికారిగా డి.యాదగిరి, సహాయ కోశాధికారిగా ఎం.నారాయణ, కార్యవర్గ సభ్యులుగా ఎం.ఆంజనేయులు, పి.చంద్రయ్య, మల్లయ్య, రాములు, యాదగిరి, కృష్ణమూర్తి, ఎం.యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు


రఘునాథపల్లి: నిర్లక్ష్యంగా బస్సు నడిపి ఇద్దరికి తీవ్ర గాయాలకు కారకుడైన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రఘునాథపల్లి పోలీసులు సోమవారం తెలిపారు. జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి వరంగల్ నుంచి జనగామ వైపు వెళ్తుండగా రఘునాథపల్లి బస్టాండ్ సమీపంలోని అండర్‌పాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న మండల కేంద్రానికి చెందిన నల్ల జీవన్‌కు స్వల్పగాయాలుకాగా, వెనకాల కూర్చున్న గండం యాకుబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు యాకుబ్ బాబాయ్ సాయి ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ తాళ్లపల్లి లింగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ



బచ్చన్నపేట: మండలంలోని లక్ష్మాపూర్‌లో రేషన్ డీలర్ ఇమ్మడి రాజేష్‌ఖన్నా తల్లి కౌసల్య (80) మృతి చెందింది. కాగా, సోమవారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు చల్ల రమేష్‌రెడ్డి, జంగిలి స్వామి, దండ్ల ఎల్లయ్య, ఇప్ప శ్రీధర్‌రెడ్డి, నూకల ముకుందారెడ్డి, భూపాల్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, ఈదుల కంటి వెంకట్‌రెడ్డి, శివరాత్రి సిద్దులు ఉన్నారు.

రిటైర్డ్ డీఈ మృతి



కృష్ణారెడ్డి (ఫైల్)

బండనాగారం గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఈ కొప్పురవు కృష్ణారెడ్డి (86) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన పంచాయతీ రాజ్ శాఖలో పలు జిల్లాల్లో ఏఈగా పనిచేసి పదోన్నతిపై డీఈగా వరంగల్‌లో విధులు నిర్వహించి రిటైర్ అయ్యారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ శివరాత్రి కవిత, ఉప సర్పంచ్ బత్తిని రాజలింగం, నాయకులు పరామర్శించారు.

బడీడు పిల్లలను బడిలోనే చేర్పించాలి



సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

పాలకుర్తి: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జెడ్పీ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, సీఆర్‌పీ లావుడ్య కిషన్ అన్నారు. సోమవారం పాలకుర్తి, ముత్తారం, చెన్నూరు పాఠశాలల పరిధిలోని గ్రామాల్లో బడిబయట ఉన్న బడీడు పిల్లల గుర్తింపునకు సర్వే చేపట్టారు. సర్వేను నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు నరేష్, సునీత, సాంబయ్య, ఐఆర్‌పీలు ఇందిర, విజయేందర్, తాడూరు రమేష్, అరుణ, మల్లేష్ పాల్గొన్నారు.

'జీపీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలి'

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామ పంచాయితీలో తీర్మానం లేకుండా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు నిధులను డ్రా చేశాడని వార్డు సభ్యులు ఆందోళనకు దిగారు. సోమవారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో సర్పంచ్ గట్టు మంజుల ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మేకల ఉపేందర్‌రెడ్డి, బాలమణి మాట్లాడుతూ గతేడాది కాలంగా పంచాయతీ తీర్మానం లేకుండానే కార్యదర్శి ఇష్టారాజ్యంగా నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. అలాగే గ్రామంలో కొత్తగా నిర్మించిన ఇళ్లకు, ఇంటి యజమాని పేరు మార్పిడికి రూ.25 వేల నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేశారన్నారు. జీపీ నిధుల స్వాహాపై ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి కార్యదర్శిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయమై జీపీ కార్యదర్శి వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఎంబీ రికార్డులు, జీపీ తీర్మానాలు లేకుండా ఎలాంటి నిధులు డ్రా చేయలేదని, అవకతవకలకు పాల్పడలేదని తెలిపారు. వార్డు సభ్యులు చిన్న కృష్ణ, సంధ్య, కరుణ ఉన్నారు.

వైభవంగా వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు, గ్రామస్తులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌లో నాగమయ్య ఆలయంలో ఆలయ ధర్మకర్తలు నారసింహుల శ్రీనివాస్, నారసింహుల ఉపేందర్ ఆధ్వర్యంలో వల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ వేడుకలకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేయడంతో పాటు భక్తుల సమక్షంలో కల్యానం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి తమ మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా, కూనూర్ రంగనాథస్వామి, గోదాదేవి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫేషియల్ అటెండెన్స్‌తో ఇక్కట్లు

- టీచర్ల విద్యాబోధనకు ఆటంకం



ఫేషియల్ అటెండెన్స్ తీసుకుంటున్న ఉపాధ్యాయుడు

జఫర్‌గఢ్: రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్‌తో ఉపాధ్యాయులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. పాఠశాలలకు ప్రతి రోజు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్యను కచ్చితంగా తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఉపాధ్యాయులు తరగతుల వారీగా డీఎస్సీ–ఎఫ్‌ఆర్‌ఎస్ అనే యాప్ ద్వారా విద్యార్థుల ముఖచిత్రాలను ముందుగానే సేకరించడం జరిగింది. ఇక ప్రతీ రోజు పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులను తరగతుల వారీగా ఉదయం యాప్‌లో ముఖచిత్రాలను సెల్‌ఫోన్ ద్వారా వెరిఫై చేసి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కాగా, ఈ ముఖచిత్రాలను వెరిఫై చేసే క్రమంలో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సరిగా ఉండకపోవడం, వారి ముఖచిత్రాలు వెరిఫై కావడంలో ఆలస్యమవుతోంది. దీంతో గంటన్నర వరకు సమయం వృథా అవుతోందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఓవక్క ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల బోధనకు తోడు ఉన్నతి కార్యక్రమం, ప్రాథమిక పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమ అమలు, రికార్డులు రాయడం వంటి విధానాలను విద్యాశాఖ చేపడుతుండడంతో ఉపాధ్యాయులపై పనిఒత్తిడి పెరుగుతోంది. కాగా, నూతనంగా చేపట్టిన ఫేషియల్ విధానంతో సమయం వృథా అవడం, విద్యాబోధనకు ఆటంకం కలగడం తప్ప పెద్దగా ప్రయోజనం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

సర్పంచ్ శివకుమార్ రిమాండ్



శివకుమార్

రఘునాథపల్లి: రఘునాథపల్లి సర్పంచ్ పోకల శివకుమార్‌ను రిమాండ్ చేశారు. మాజీ మావోయిస్టు కుటుంబానికి సంబంధించిన స్థలం విషయంలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గిద్దబండతండాకు చెందిన మాజీ మావోయిస్ట్ మూడ్ లింబాకు గతంలో ప్రభుత్వం 300 చదరపు గజాల స్థలం కేటాయించింది. ఆ స్థలంలో లింబా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్నాడు. లింబా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తమ నివాసాన్ని గిద్దబండతండాకు మార్చారు. స్థలం తనకు విక్రయించాలని వారిపై శివకుమార్ ఒత్తిడి తీసుకువచ్చాడు. వారు అంగీకరించకపోవడంతో ఇంటి వద్ద బాత్రూంను కూల్చి వేయించాడు. ఏటా సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో నిమజ్జనం పేర ఆ ఇంటి పక్కనే గోతులు తీసి ఇల్లు ధ్వంసం చేస్తున్నాడు. ఇంటిని కూల్చవద్దని కుటుంబ సభ్యులు వేడుకున్నా శివకుమార్ మాజీ మావోయిస్ట్ నాన్నమ్మను కాలితో తన్నాడు. దీంతో ఆమె గాయపడింది. ఈ విషయమై నవంబర్ 2న లింబా కుమారుడు మూడ్ దేవేందర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో వాస్తవాలు తేలడంతో శివకుమార్‌ను రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.